# పకడ్బందీగా ఎన్నికల ఏర్పాట్లు..

- కూకట్‌పల్లిలో.. పోలింగ్‌కు సర్వం సిద్ధం
- 156 లొకేషన్లు.. 418 పోలింగ్ బూత్‌లు
- 4.63 లక్షల ఓటర్లు..
- ఎన్నికల ప్రక్రియలో 2 వేలకు పైగా సిబ్బంది

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 29 : కూకట్‌పల్లి నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఘట్టాన్ని ప్రశాంతంగా.. పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు రిటర్నింగ్ ఆఫీస్ టి.శ్యాంప్రకాశ్ తెలిపారు. బుధవారం జేఎన్‌టీయూహెచ్‌లో ఈవీఎంలు, ఎన్నికల నిర్వహణ సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో కీలక ఘట్టమైన పోలింగ్ ప్రక్రియ కోసం అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గానికి చెందిన తుది ఓటరు జాబితాను ప్రచురించడంతో పాటు పోలింగ్ కేంద్రాలను గుర్తించడం, వాటిలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో ఓటు హక్కును వినియోగించుకునేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈవీఎం మిషన్లు, వీవీప్యాట్లను అనుసంధానం చేయడం ద్వారా ఓటు వేసిన వెంటనే ఏ అభ్యర్థికి ఓటు వేశామో వెంటనే వీవీప్యాట్ ద్వారా నిర్ధారించుకోవచ్చన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

**4.63 లక్షల ఓటర్లు..**

కూకట్‌పల్లి నియోజకవర్గంలో తుది ఓటరు జాబితా ప్రకారం 4,63,864 మంది ఓటర్లు ఉన్నారు. 2.42.832 మంది పురుషులు, 2.20.909 మంది స్త్రీలు, ఇతరులు 123 మంది ఓటర్లు ఉన్నారు. నియోజకవర్గం పరిధిలో 153 లొకేషన్లు (బిల్డింగ్)లలో 418 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ పోలింగ్ కేంద్రాలలో 232 సమస్యాత్మకమైనవిగా గుర్తించి ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేశారు. ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో 2వేలకు పైగా సిబ్బంది విధులు నిర్వర్తించనున్నారు. పోలింగ్ కేంద్రాలలో దివ్యాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేక వీల్ చైర్లు, ర్యాంపుల నిర్మాణం, మూత్రశాలలు, తాగునీటి సౌకర్యాన్ని కల్పించారు. సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగనుంది. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని పోలింగ్ కేంద్రం నుంచి 200 మీటర్ల దూరం బయటే ఓటరు స్లిప్పులను పంపిణీ చేయాల్సి ఉంటుంది. పోలింగ్ కేంద్రాలలో వెబ్‌కాస్టింగ్‌తో రికార్డు చేయడం జరుగుతుందని.. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో సీసీ కెమెరాల నిఘా పెట్టారు.

## ఓటు హక్కును వినియోగించుకోవాలి..



ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్తులు కావాలని బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవాలి. నియోజకవర్గంలో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఇప్పటికే ఇంటింటికి పోలింగ్ చిట్టీలను పంపిణీ చేయడం జరిగింది. ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. పోలింగ్ రోజును సెలవు దినంగా భావించకుండా బాధ్యతగా పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతున్నాం. ఇప్పటికే ఉద్యోగులు, దివ్యాంగులు, వృద్ధులు 672 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటరు జాబితాలో పేరున్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు వేయాలని కోరుతున్నాం.

– టి.శ్యాంప్రకాశ్, ఆర్‌వో, కూకట్‌పల్లి నియోజకవర్గం

## ఆలోచించి ఓటువేసి ఆశీర్వదించాలి



పదేండ్ల కాలంగా కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా అభివృద్ధి చేశానని.. బంగారు భవిష్యత్ కోసం మరోసారి బీఆర్‌ఎస్‌ను ఆదరించాలని.. ఆలోచించి ఓటేసి మూడోసారి ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధించిందని పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందాయన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో 70 ఏండ్లలో పరిష్కారం కాని సమస్యలను 10 ఏండ్ల కాలంలోనే పరిష్కరించానన్నారు. కులాలు, మతాలు, ప్రాంతాలకతీతంగా ప్రలజందరికీ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కామే లక్ష్యంగా పనిచేశానన్నారు. తన హయాంలో వేలాది కోట్ల నిధులను తీసుకొచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని తెలిపారు. కూకట్‌పల్లి హద్దులు తెలియని నాయకులకు ఓటేయడం దండగని అందుబాటులో ఉండే తనను ఆశీర్వదిస్తే నియోజకవర్గంలో మిగిలిన సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని తెలిపారు. చేసిన పనులు కండ్లముందే కనబడుతున్నాయని.. కులాలు, మతాలు అంటూ ఉగ్వేదంతో కాకుండా విజ్ఞతతో ఆలోచించి ఓటెయ్యాలని కోరారు.

– మాధవరం కృష్ణారావు, బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి, కూకట్‌పల్లి

